# ఇలాగే జరుగుతుంది

ప్రొఫెసర్ వ్యాస్ కుర్చీలో ఇబ్బందిగా కదిలి వాచీ చూసుకున్నాడు. అతడి చేతుల్లో ఒక పెద్ద కవరుంది. జాగ్రత్తగా గమనిస్తే అతడి చేతులు టెన్షన్‌తో వణకటం కనిపిస్తుంది.

అతడి చేతిలో వున్న కవరులో నిక్షిప్తమై వుంది ఒక అపురూపమైన విషయం.

అది బైటపడిన మరుక్షణం యావత్ ప్రపంచం అతడికి నివాళు లర్పిస్తుంది.

ప్రొఫెసర్ వ్యాస్ మళ్ళీ అసహనంగా వాచీ చూసుకున్నాడు. ఐదున్నర అయింది. ఒక్కరొక్కరే లోపలికి వెళ్ళి వస్తున్నారు. విజిటర్స రూమ్ అది. వరుసగా కుర్చీలు వేసి వున్నాయి. అతడే చివరికి మిగిలేడు. అతడికి ఐదింటికి అప్పాయింట్‌మెంట్ ఇవ్వబడింది.

ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఆఫీసులో విజిటర్స రూమ్ అది. రూమ్ లోపలికి వెళ్తున్న వాళ్ళు ప్రెసిడెంట్‌ని కలుసుకోవటానికి వెళ్తున్నారు. వాళ్ళందరూ రెండు నెలల

ముందే సరయిన టైమ్‌లో సహా అప్పాయింట్‌మెంట్ తీసు కున్నవాళ్ళు. ఒక్కొక్కరికీ ఐదూ- పదీ- పదిహేనూ ఇలా అవసరాన్నిబట్టి సమయం కేటాయించబడింది.

వ్యాస్ మాత్రం తను కనుక్కున్న విషయం ఆ ఫార్ములా కాగితాల కాపీ మాట్లాడవలసిన పని వ్రాసి పంపి గానే పది రోజుల్లో వచ్చి కలుసుకొమ్మని జవాబు వచ్చింది.

అతడి ఫార్ములాని విదేశాలు తీసుకెళ్తాయనీ- గూఢ చారులు వెంటబడ్తారనీ- ఇలాటి చౌకబారు డిటెక్టివ్ కథల భయం ఏమీ లేదు. మామూలుగానే ఢిల్లీ వచ్చాడు.

ఇచ్చిన టైమ్‌కి ప్రెసిడెంట్ భవనానికి వెళ్ళాడు. అక్కడ అతడి ఐడెంటిటీ పరిశీలించబడింది. ఇంకొద్ది క్షణాల్లో తను ప్రెసిడెంట్‌ని కలుసుకోబోతున్నాను అన్న భావం అత డిలో ఏమాత్రం కలగజేయటం లేదు. తను కనుక్కున్నది ప్రపంచానికి వెల్లడికాబడ్తున్నది అన్న భావం అతడిలో వుద్వేగాన్ని కలగజేస్తున్నది.

ఇంతలో పిలుపు రావటంతో అతడు ఆలోచనల నుంచి తేరుకొని లోపలికి వెళ్ళాడు. లోపల సోఫాలో చాలా ఇన్ ఫార్మల్‌గా కూర్చొని వున్నాడు ప్రెసిడెంట్. ప్రొఫెసర్ వ్యాస్‌ని చూసి నవ్వి కూర్చోమన్నట్టు చేయి చూపించేడు.

కొంచెంసేపు మామూలు సంభాషణా, పరిచయాలూ జరిగేక వ్యాస్ ముందుకువంగి, "నేను... నేను ఒకవిషయాన్ని కనుగొన్నాను" అన్నాడు ఉపోద్ఘాతంగా. అతడి కంఠం వణుకుతూంది.

అయితే ప్రెసిడెంట్ మొహంలో ఆశించినంత ఉద్వేగం కనబడలేదు. కానీ, వ్యాస్ ఆతృత గమనించినట్టూ నవ్వి, "మీరు పంపించిన కాగితాలు మావాళ్ళు చదివి వివరించారు ప్రొఫెసర్. నాకు కొద్దిగా విషయం తెలిసింది" అన్నాడు. "...మీరు మిగతా విషయాలు చెప్పండి-"

వ్యాస్ గొంతు సవరించుకొని, "నికోటిన్" అన్నాడు. "చాలామంది శాస్త్రజ్ఞులు నికోటిన్‌ని చాలా అపాయకరమైన వస్తువుగా భావిస్తారు. కానీ నికోటిన్ ఆల్కహాలు కొన్ని విపరీతమైన పరిస్థితుల్లో కలిస్తే ఒక రకమైన గ్లూకోజ్ తయారవుతుందని నేను కనుక్కున్నాను."

"ఆ విషయం మీ రిపోర్టులో వ్రాసేరు."

"ఆ గ్లూకోజ్ ఒక మాత్ర పరిమాణంలో తీసుకుంటే మనిషి శరీరంలోకి అది ప్రవేశించేక కోటింగ్ ఏర్పరుస్తూ పోతుంది. గుండె-కాలేయం-ఊపిరితిత్తులు ఒకటేమిటి అన్ని అంగాలకి అది భద్రత చేకూరుస్తుంది. బ్రతికినంతకాలమూ ఆ కోటింగ్ అలానే వుంటుంది. అంటే... అంటే...ఇక మనిషికి అనారోగ్యం అన్నదే వుండదన్న మాట. కేన్సర్, క్షయ, పక్షవాతం యిలాంటి రోగాల్ని మానవుడు మర్చిపోతాడు. చివరికి తలనొప్పి అంటే కూడా ఏమిటో వచ్చే తరానికి తెలీదు. ఆస్పత్రి అన్న పదం కేవలం డిక్షనరీల్లోనే మిగులుతుంది. ప్రతీ మనిషీ రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తాడు."

ఈ మాటలు చెబుతున్నప్పుడు వ్యాస్ మొహం ఒక రక

మైన దీప్తితో వెలిగింది. ఎంతో శ్రమపడి ఒక గొప్ప విష యాన్ని కనుక్కున్నవాళ్ళు ఆ విజయం తాలూకు వివరాల్ని ప్రజల ముందుపెట్టి వారు సంభ్రమంతో దాన్ని ఆస్వాదించ బోతుంటే వచ్చే ఆనందం అది. చాలా గొప్ప విజయం సాధించిన వాళ్ళకే దాంట్లో వుండే ఆనందం తెలుస్తుంది.

వ్యాస్ చెప్పటం మొదలుపెట్టాడు– "ఈ విషయం కనుక్కున్న వెంటనే నేను దీన్ని వెల్లడించలేదు ప్రెసిడెంట్! రెండు సంవత్సరాలు ప్రయోగం చేసేను. ఆ ప్రయోగం ఎవరి మీదో కాదు– నా భార్య మీదే. ఆమెకో టాబ్లెట్ ఇచ్చి పరిశీలిస్తూ వచ్చాను. ఏ దుష్పరిణామమూ కలగలేదు. అనుకున్నట్టే– ఏ వ్యాధీ ఆమెను చేరలేకపోయింది. ఐస్ ముక్కలు తలమీద గంటలకొద్దీవుంచినా జలుబుచేయలేదు."

"–కాబట్టి ఇక మీరు చేయవలసిందల్లా ఒకటే. ఈ మాత్రని ప్రపంచానికి అందించటం... నెలరోజుల్లో ప్రపంచం లోని ప్రతివ్యక్తీ ఈ మాత్రని ఒకదాన్ని వేసుకునే ఏర్పాటు చేయటం– అంతే."

అమరత్వం సిద్ధించిన ఋషిలా సంతృప్తితో వెలిగి పోతున్న వ్యాస్ మొహంలోకి ప్రెసిడెంట్ నిర్లిప్తంగా చూసేడు.

"ఇదంత సులభం అని ఎందుకనుకుంటున్నారు మిష్టర్ వ్యాస్" తాపీగా అడిగిన ప్రశ్నకి ఉలిక్కిపడ్డాడు వ్యాస్.

"ఏమిటి... ఏమిటంటున్నారు మీరు ?"

"చాలా గొప్ప విషయాన్ని, ప్రపంచంలో ఏ శాస్త్ర

జ్ఞుడూ కనుక్కోలేని విషయాన్ని మీరు కనుక్కున్నారు. మీకు నా అభినందనలు" అంటూ పక్కనున్న ఫైలు తీసుకున్నాడు ప్రెసిడెంట్. తీసుకుంటూ అన్నాడు- "మీ పరిశోధన తాలూకు వివరాలు అందగానే నేను కొన్ని వివరాలు అధికారుల నుంచి తెప్పించాను. ఇవిగో అవి" అంటూ కాగితాలు పరిశీలిస్తూ అన్నాడు.

"మన దేశంలో ఉన్న ఆస్పత్రులు దాదాపు పది మిలియన్లు. యాభై లక్షల మందికన్నా ఎక్కువ డాక్టర్లున్నారు. వీరు కాక ఆరెమిప్పాలు, హోమియోపతి వగైరా. ప్రొఫెసర్ వ్యాస్ !- నెలరోజుల తరువాత వీళ్ళందరూ ఏం చెయ్యాలి ?"

అప్రతిభుడైన వ్యాస్, ఒక క్షణం మాట్లాడ లేక పోయాడు. ప్రెసిడెంట్ కొనసాగించేడు-

"సరే, డాక్టర్ల సంగతి అలా వుంచండి - మందులు తయారుచేసే కంపెనీలు ఎన్ని మూతబడ్తాయి? ఆ కార్మికులు అందరూ ఏమవుతారు? కోటికి పైగావున్న మెడికల్ షాపులు- ఆపరేషన్ పరికరాలు తయారుచేసే కర్మాగారాలు - ఎక్స్‌రే యూనిట్లు- మొత్తం అంతా కలిపితే- దాదాపు యాభై కోట్ల మంది జనం తమ జీవనాధారాలు కోల్పోతారు. వీరందర్నీ ఏం చెయ్యమంటారు మిష్టర్ వ్యాస్ ?"

"కానీ ఈ మాత్ర ఆకల్ని కూడా చంపేస్తుంది సర్! కేవలం విటమిన్ మాత్రలు చాలు."

"అయితే మరీ కష్టం- రైతులూ- పిండిమరలూ- ఫుడ్ కార్పొరేషన్ ఉద్యోగస్తులూ- వీళ్ళందర్నీ ఏం చెయ్యాలి? చెప్పండి వ్యాస్?"

షాక్ తగిలినట్టూ నిశ్చేష్టుడయ్యాడు వ్యాస్. అతడు అనుకున్నది వేరు. తన పరిశోధన గురించి చెప్పగానే ప్రెసిడెంట్ తనని ఆకాశానికి ఎత్తేస్తాడనుకున్నాడు. నోబుల్ ప్రైజ్ గురించీ, ప్రజలు వెల్లువై పట్టే బ్రహ్మరథాల గురించీ కలలు కన్నాడు. ఈ నిరాసక్తతని అతడు కలలో కూడా ఊహించలేదు.

"మరి ఇప్పుడు... ఇప్పుడు ఏం చెయ్యటం?" అని అడిగేడు తనలో తనే మాట్లాడుకుంటున్నట్టూ.

"ఈ వార్తని వెల్లడి చేయటానికి కూడా వీల్లేదు వ్యాస్. అప్పుడు నా మీద చాలా వత్తిడులు కూడా వస్తాయి" అన్నాడు ప్రెసిడెంట్. "దీని గురించి జాగ్రత్తగా ఆలోచించాలి. ఎకనమిక్ రివల్యూషన్, టోటల్ షాక్‌ల బారినుంచి ప్రపంచాన్ని ముందు రక్షించాలి. నెమ్మది నెమ్మదిగా ఈ మందుని ప్రవేశపెట్టాలి. ఒక పద్ధతి ప్రకారం మెడికల్ కాలేజీలు మూసేసుకుంటూ రావాలిది.

ఈ మాత్రల కోసం జనం విప్లవం తీసుకురాకుండా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. మనిషి ఆరోగ్యంకన్నా దేశం సక్రమంగా నడవటం నాకు కావల్సింది."

పేపర్లు సర్దుకుని వ్యాస్ లేచేడు. ఇక మాట్లాడవలసిందేమీ లేదు. ప్రెసిడెంట్ కూడా లేచి షేక్‌హాండ్ ఇస్తూ

"కంగ్రాచ్యులేషన్స్ ప్రొఫెసర్! మీ పేరు చరిత్రలో సువర్ణాక్షరాల్తో లిఖించబడుతుంది. మానవ జాతి భూమిమ్మీద వున్నంతకాలం మిమ్మల్ని మర్చిపోదు." అన్నాడు.

"కానీ నా కొద్దిగా టైమ్ ఇవ్వండి. మీ మాత్ర ప్రతీ ఒక్కరికీ చేరేటందుకు కొంత టైమ్ కావాలి."

"ఎంత టైమ్ కావాలి మిష్టర్ ప్రెసిడెంట్ ?"

"యాభై సంవత్సరాలు—"

• • •

ఎయిర్‌పోర్ట్ నుంచి టాక్సీలో ఇంటి కొస్తున్నాడు వ్యాస్. అతడి మనసు కుత కుతలాడిపోతూంది. అసలు తనే ఈ మాత్ర తయారు చేసి అందరికీ పంచాలి. అప్పుడు గానీ ఈ అధికారులకి బుద్ధి రాదు.

టాక్సీ ఇంటి ముందు ఆగింది.

దిగి, బ్రీఫ్‌కేస్ తీసుకొని లోపలికి వెళ్ళాడు. ఇల్లంతా నిర్మానుష్యంగా వుంది. అతడు కొంచెం ఆశ్చర్యపడుతూ భార్య కోసం వెతికేడు. ఆమె ఎక్కడా కనబడలేదు. బల్ల మీద ఆమె పెట్టిన చీటీ మాత్రం కనబడింది.

"ప్రియమైన మీకు—

నేనిలా ఉత్తరంపెట్టి వెళ్ళిపోవటం ఆశ్చర్యంగా కనిపించవచ్చు. కానీ నా తరఫు నుంచి ఆలోచించండి. మీతో వివాహమైన ఈ ముప్ఫై సంవత్సరాల్లో నేనేమి అనుభవించాను ? మీకెప్పుడూ మీ పరిశోధనలూ-లెక్కలే. నన్నొక భార్యగా ఎప్పుడూ మీరు గుర్తించనేలేదు. చివరికి మీ

పరిశోధనకి కూడా నేనే కావల్సి వచ్చాను.

అయితే మీ కో అనుమానం రావచ్చు- ఇంతకాలం ఎందుకు కలిసి వున్నానని ?

-ఇంకేం చెయ్యగలను ప్రొఫెసర్ వ్యాస్. స్త్రీగా పుట్టినందుకు-ఎవర్నో ఒకర్ని వివాహం చేసుకుని- ఆ భర్తనే దేముడిగా కొలవాల్సిన దౌర్భాగ్యం మాది. మా రక్షణ కోసం-మా ఆకలి కోసం మిమ్మల్ని ప్రేమించాల్సి వస్తూంది. మీరు ఎంతకాదన్నా మీతోనే బ్రతకాల్సి వస్తూంది.

కానీ ఈ రోజు మీ రిచ్చిన మాత్రతో ఇక నాలో ఆకలి వుండదు. రోగ భయం వుండదు. మరెందుకు మీతో కలిసి వుండటం ? వెళ్ళిపోతున్నాను— మీ భార్య."

ప్రొఫెసర్ వ్యాస్ ఆ కాగితాల్ని బల్ల మీద పెట్టి కుర్చీలో కూలబడ్డాడు. చాలాసేపు నిశ్శబ్దంగా అలానే కూర్చొని వుండిపోయేడు.

రాష్ట్రపతి ఎకనమిక్ రివల్యూషన్ గురించే ఆలోచించేడుకానీ సోషల్ కాన్షియస్నెస్ ఆలోచించలేదు. ఈ ప్రపంచంలో మనిషికీ మనిషికీ మధ్య ఆప్యాయతలూ-ప్రేమ, అనురాగం అన్నీ 'ఆకలి' అనే పునాది మీదే నిర్మించబడ్డాయన్న మహత్తర విషయం అతడికి ఆ క్షణం బోధపడింది.

అతడు నెమ్మదిగా తన పరిశోధన తాలూకు కాగితాలు చేతిలోకి తీసుకున్నాడు.

ఆ తరువాత వాటిని అగ్గిపుల్లతో వెలిగించాడు.